# గరీబోళ్ళు కావలెను

రంగారెడ్డి స్నానం చేసి బాత్‌రూమ్ లోనుంచి బయటికొచ్చేసరికి వాళ్ళావిడ ఇల్లంతా ఆనందంగా ఊడుస్తూ హుషారుగా పాటలు పాడుతూ వీలయితే ఒకటిరెండు డాన్స్ స్టెప్పులాంటివి కూడా వేస్తోంది.

రంగారెడ్డికి మతిపోయినట్లయింది.

అసలామె తన భార్యేనా అని కొంచెం అనుమానంగా కూడా వచ్చింది.

"ఏమిటీ అంత హుషారొచ్చిందివాళ? కాపురానికొచ్చాక నీ మొఖంలో ఇంత సంతోషం కనిపించటం ఇదే మొదటిసారి! ఏమిటి సంగతి?" అనడిగాడు డౌటుగా.

"రాక రాక సంవత్సరానికొకసారి వచ్చేరోజు కదండీ ఇది! అందుకని ఈ రోజు తనివితీరా సెలబ్రేట్ చేసుకోవాలి!" అందామె ఇంకా ఉత్సాహంగా! అనటమే కాకుండా అల్మారాలో నుంచి మిగిలిపోయిన దీపావళి మందుసామగ్రిలోనుంచి కాకరపువ్వొత్తులు తీసి వెలిగించి గాలిలో ఎగురుతూ పాట కూడా అందుకుంది.

"భలేమంచిరోజు పసందయిన రోజు – వసంతాలు పూచే మేటిరోజు–" ఒకవేళ ఇంటివాస్తు సరిగ్గా లేకపోవటం వల్ల తనభార్యకేమయినా మతిభ్రమించటం లాంటిది జరిగిందేమోనన్న చిన్న అనుమానం కూడా వచ్చిందతనికి.

"ఇవాళ మీ ఆడాళ్ళ పండుగేమయినా ఉందేమే?"అడిగాడు మళ్ళీ.

"ఆడాళ్ళ పండుగ కాదండీ! కోడళ్ళ పండగ! ఇవాళ మీ అమ్మ – అంటే మా అత్తగారి పీడ విరగడయిన రోజు! అందుకే ఈ సంబరం ... భలే మంచిరోజు– పసందయిన రోజు..."

రంగారెడ్డికి ఆమె మీద ఒళ్ళు మండిపోయింది.

"ఏమేవ్ నీకేమయినా బుద్ధుందా? మా అమ్మ పోయినరోజు నీకు పండుగ లాగుందా? నీకేమయినా పిచ్చెక్కిందా?" కోపంగా అరిచాడు.

"ఏం? బ్రతికున్నన్నాళ్ళూ మా పుట్టింటినుంచి డబ్బు తెమ్మని, నగలు తెమ్మని ఎలా కాల్చుకుతిందో మీకు తెలీదా? నేను కాపురానికొచ్చిన మర్నాడే చాకలినీ, పనిమనిషినీ

మానిపించి ఆ పనులన్నీ నాతో చేయించలా? ఇంకా దానికి గౌరవం ఇచ్చేదేమిటి? గాడిద గుడ్డు– హు– భలే మంచిరోజు పసందయిన రోజూ–"

"అలాగా! రేపొద్దున్న నీ కోడలు కూడా నీ సంవత్సరానికి  ఇలాగే డాన్సులు చేస్తూ ఎలావుంటుందో ఒక్కసారి ఊహించుకో–"

"నేను మీ అమ్మలాగా కోడల్ని కాల్చుకుతింటేకదా–"

"సంతోషించాంగాని వెళ్ళి మా అమ్మ ఫోటో దగ్గర పూజసామాన్లన్నీ పెట్టు– అలాగే మా అమ్మకిష్టమయిన వంటకం కూడా ఏదయినా చెయ్–"

"మీ అమ్మకు 'కొరివికారం' చాలా ఇష్టం! అదే బాగా నూరి మీ అమ్మ ఫోటో ముందు పెడతాలే!" మీ చేత్తో తినిపించండి–"

"అబ్బబ్బ– ఆ పిచ్చి వాగుడాపి త్వరగా వంటకానీ– నేను పూజ చేసుకుని బయటకెళ్ళి  ఎవడయినా బీదాడు దొరికితే తీసుకొస్తాను! ఇవాళ బీదాళ్ళ కడుపునిండా బోజనం పెడితే మా అమ్మ ఆత్మ సంతోషిస్తుంది"

"అయ్యో సంబడం! మీ అమ్మ ఆత్మను సంతోషించడం కూడా తెలిసేద్చా? ఆ బీదాడిని దయ్యమయి పట్టుకోకుండా ఉంటే చాలు"

విసురుగా చీపిరికట్ట మూలపడేసి లోపలికి వెళ్ళిపోయిందామె.

రంగారెడ్డి పూజ గదిలోకి నడిచాడు.

తల్లి ఫోటోకి దణ్ణం పెట్టుకుని బయటటికొచ్చేసరికి యాదగిరి ఎదుర్చూస్తూ కూర్చుని ఉన్నాడు.

"రంగారెడ్డీ! మీ మదర్ తద్దినం గురించి గరీబోడిని తోలుకొచ్చి భోజనం గిట్ట పెట్టాల్నంటివి గదా! పోదామా మళ్ళా?"

'నీ కోసమే వెయిట్ చేస్తున్నాయాదగిరీ– నిమిషంలో రడీ అయొస్తా – ఏమేవ్! యాదగిరి వచ్చాడు– జర చాయ్ ఇవ్వు"– అనేసి లోపలికెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చాడు.

యాదగిరి చాయ్ తాగగానే ఇద్దరూ గరీబోడిని వెతకటానికి బయల్దేరారు.

కాలనీ దాటగానే ఓ బిచ్చగాడు చెట్టుకింద కూర్చుని అడుక్కుంటూ కనిపించాడు.

"అమ్మయ్య! దొరికాడు" అన్నాడు రంగారెడ్డి బిచ్చగాడి వేపు సంతృప్తిగా చూస్తూ.

"మందేశంల గరీబోండ్లకు తక్కువేమున్నదన్నా! ఏక్‌ఢూండో – హజార్ మిల్‌తేహై!" నవ్వుతూ అన్నాడు యాదగిరి.

ఇద్దరూ బిచ్చగాడిని సమీపించారు.

"టెన్‌రుపీస్ దానం చేయండి దొరా!" అన్నాడతను వాళ్ళని చూడగానే. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఏమిటి? పదిరూపాయలు దానం చేయాలా? పావలా, అర్ధా పోయి ఏకంగా పది కావాలా?" ఆశ్చర్యంగా అన్నాడు రంగారెడ్డి

"ఇగోసార్! నా బిజీనెస్ ఎట్ల జేసుకోవాల్నో నా కెరుక! నీ సలహాలు గిట్టనా కొద్దు. ఇష్టముంటే పైసలు దానం జెయ్ - లేకుంటే లేదు" అవ్‌సార్! నాకు తెల్వక అడుగుతా. మీ లెక్క సర్కార్ కొలువులు జేసేటోళ్ళకూ జీతం ఎక్కువిస్తున్రు- అది తగ్గించాలె అని నేనెన్నడయినా అంటినాసార్" చిరాగ్గా అన్నాడు వాడు.

యాదగిరికి కోపం ముంచుకొచ్చింది వాడి మాటలకు!

"ఏమిరోయ్! ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నావ్- ఏంది సంగతి?" చొక్కా చేతులు మడుస్తూ అన్నాడు యాదగిరి.

రంగారెడ్డి సర్దిచెప్పాడతనికి.

"పోనీ యాదగిరీ! ఇంతకూ వీడు మనింటికి భోజనానికి వస్తాడేమో అడుగు"

"ఏరా! నీ పంట పండిందివాళ! ఈ అయ్య ఇంటికి నడు- మంచిగ భోజనం పెడతానంటుండు"

"మంచిగ దందా నడుస్తుండగా భోజనానికెళ్ళనికి ఏడకెళ్ళవుతది సార్. ఇంకెవళ్ళనయినా జూసుకోండ్రి-" చిరాగ్గా అన్నాడు వాడు.

ఇద్దరికీ వళ్ళు మండిపోయింది.

ఈ సాలెగానికి పుక్కట్‌గా కూసుని కమాయించెడిది ఆదతయింది. ఈ గల్లీ చివర్ల లేబర్ కాలనీ ఉన్నది గదా - ఆడ రాములని గరీబు ఫామిలీ ఉన్నది. ఆళ్ళను తోల్క పోదాం-" అన్నాడు యాదగిరి.

ఇద్దరూ లేబర్ కాలనీ చేరుకున్నారు.

రాములు తన పాకముందు నులకమంచం మీద పడుకుని టేప్‌రికార్డర్ వింటూ బీడీ తాగుతున్నాడు.

"అరే రాములూ" పిలిచాడు యాదగిరి.

వాడు ఇద్దరినీ  చూశాడుగానీ లేవకుండానే దణ్ణం పెట్టాడు.

"దణ్ణం దొరా – ఏందిలా అచ్చినావ్?"

'ఇగో ఈ రంగారెడ్డి దొర ఎరుకేగదా నీకు – ఇయాళ గరీబోళ్ళకు మంచిగ భోజనం పెట్టాల్నని ఈడకచ్చినాం! నువ్వూ, నీ పెండ్లాం, నీ పోరగాడు ముగ్గురూ మాతోటి రావాలె!"

రాములు లేచి కూర్చున్నాడు.

"భోజనానికి  రావాల్నా సార్?"

"అవును రాములూ – మా ఇంటిదగ్గరే?"

"మీ ఇల్లేడ సార్?"

"మా  కాలనీలోనే మిల్క్‌బూత్ పక్క కనుక్కోరాదు? గిప్పుడు మీ కాలనీ ఏడున్నదని అడుగుతావా ఏంది?"

రాములు తల గోక్కున్నాడు.

"నేనూ, నా పెండ్లాం, నా పిల్లగాడు – ముగ్గురు మనుషులం భోజనానికి రావాలె! గంతనే గద్సార్?" అడిగాడు అనుమానంగా.

"అవును"

'ముగ్గురు మనుషులు– గాడ – మీ కాలనీకి రావాలె! ముగ్గురంటే ఇద్దరు పెద్దోళ్ళు –ఒక చిన్నకూలీ– ముగ్గురం ఆడకి అచ్చి గాడ భోజనం చేయాలె– చేసినాక మళ్ళీ ఆడకెళ్ళి ఈడ మా గుడిశెకు రావాలె! గంతనే గదా! బరాబర్ అస్తాం దొరా! మరి పైసలన్ని ఇస్తున్రు?"

రంగారెడ్డి, యాదగిరి ఉలిక్కిపడ్డారు.

"పైసలా! పైసలేంది? నిన్ను రమ్మంటున్నది భోజనం చేయానికిరా! కూలికి గాదు!" యాదగిరి వివరంగా చెప్పాడు.

"అదేసార్! సమజయింది! భోజనానికే  రావాలె! గానీ నీకెరుకలేనిదేమున్నది దొరా! ఇయాల్రేపు గరీబోల్లకు జర డిమాండెక్కువున్నది – ఎలక్షన్లు గూడా వస్తనే ఉండె! ఎవ్వళ్ళకయినా గానీ మంది తోటి మతలబున్నది! మస్తుగా పైసలు కమాయించెడి దినాలు సార్ ఇవి!"

రంగారెడ్డికి వీడి మాటలేమీ అర్థం కావటం లేదు.

'గరీబోళ్ళకు డిమాండెక్కవుందా? కూలిపనికి ఏం డిమాండ్?" అడిగాడు తను.

"కూలి పనిగ్గాదు సార్– అగో– ఆడచూడండ్రి! కార్లు అస్తనే ఉన్నయ్–"

అంటూ ఛప్పున భార్యను పిలిచాడు "ఏయ్ చంద్రమ్మా! గోల్‌మాల్ నర్సిమ్మ అస్తుండు! జల్దీరా!" బక్కగా ఉన్న అతని భార్య హడావిడిగా బయటికొచ్చి అతని దగ్గర నిలబడింది. నాలుగు కార్ల రివ్వుమంటూ వచ్చి ఆగినయ్. లోపల్నుంచి మినిష్టరు కలక్టరు, గోల్‌మాల్ నర్సింహ దిగారు. వాళ్ళతోపాటు కొంతమంది పార్టీ వర్కర్లు –

హఠాత్తుగా నినాదాలు ప్రారంభించాడు నర్శింహ.

ప్రజల కాళ్ళ వద్దకు అధికారులూ – జిందాబాద్ జిందాబాద్

ప్రజల కాళ్ళవద్దకు ప్రభువులూ – జిందాబాద్ జిందాబాద్

నినాదాలు పూర్తవగానే నర్శింహ రాములు వీపుమీద గట్టిగా చరచాడు.

"ఇంకా నిలవడ్డావేందిరా! మినిష్టర్ సాబ్ నీ గుడిశెకొచ్చిండు – కాళ్లమీదపడు–"

రాములు, చంద్రమ్మ, వాళ్ళ పిల్లడు అమాంతం మినిష్టర్ కాళ్ళమీద పడ్డారు. మినిష్టర్ వాళ్ళని లేవనెత్తాడు.

"లేవండి లేవండి! మేము మీకు సేవలు చేయడానికొచ్చాం గానీ మీతో కాళ్లు మొక్కించుకోడానికి కాదు– కలెక్టర్ గారూ! టి.వి.ఛానెల్‌వాళ్ళను, కెమారాలతో రమ్మనండి."

నర్శింహ హడావుడి చేస్తూ కెమారాలన్నీ మినిష్టర్ ముందు ఏర్పాడు చేశాడు.

'అరేయ్ రాములూ! ఆ పిచ్చి సూపులేందిరా! మంచిగ నవ్వుతా నిలవడు" దబాయించాడు నర్శింహ.

రాములు నవ్వుతూ నిలబడ్డాడు.

టి.వి.కెమెరాలు ఆన్ అయాయ్.

హఠాత్తుగా మినిష్టర్ రూపంలో మార్పువచ్చేసింది. ప్రజలను ఉద్ధరించే లెవల్లో ఏడుపొక్కటే తక్కువగా మొఖం పెట్టాడు. కాని ప్రేమ, జాలిని ప్రదర్శించటానకి చాలా శ్రమ పడాల్సి వచ్చింది.

"చూడు రాములూ! నీకేమయినా కష్టాలూ, సమస్యలూ ఉంటే నాతో చెప్పు– అవన్నీ ఇక్కడికిక్కడే పరిష్కరిస్తాను–" అన్నాడు ప్రేమగా,జాలిగా –

"గట్లనే దొరా" అంటూ రాములు ఛటుక్కున వెనక్కు తిరిగి టి.వి. కెమారాలకు అభిముఖంగా నిలబడ్డాడు. "కష్టాలు కాకుండే ఏంది దొరా! కరెంట్ ఛార్జీలు పెరిగిపాయె– వస్తువుల ధరలన్నీ పెరిగిపాయె– ఏం తినేటట్టు లేదు– ఏం కొనేటట్టు లేదు – " అంటూ కెమెరాకు రకకరాల ఫోజులిస్తూ మాట్లాడుతూంటే నర్సింహలాగి అతని నెత్తిమీద ఒకటిచ్చాడు.

"కెమెరాబంద్ జేయ్ వయ్యా– ఇగో రాములూ! నీకేం దమాక్ గిట్టఖరాబున్నదా? మినిష్టర్ సారీదుంటే నువ్ ఆడెందుకు తిరిగినవ్ బే?"

"అటు తిరక్కుంటే – టి.వి.ల నేను కనబడే దెట్ల దొరా?"

"అరేయ్– ఒక్కటి తన్నానంటే కిందపడిసస్తావ్– సాలే ఔలే! టి.విలో కనబడాల్సింది నువ్ కాదురా బాడుకవ్– మినిష్టర్ సాబ్– ఎరికయిందా?"

"అయింది దొరా–"

మళ్ళీ కెమెరాలు స్టార్టయినయ్.

మినిష్టరుగారు మళ్ళీ మొఖంలోకి ప్రేమ, జాలి అతికష్టంమీద తెచ్చుకున్నారు.

"ఏమోయ్ రాములూ! నీకేమయినా కష్టాలూ, సమస్యలూ ఉంటే నాతో చెప్పు– మా ప్రభుత్వంలో పేదలంతా ఆనందంగా, సుఖంగా బ్రతకాలి! మాది పనిచేసే ప్రభుత్వం– ఇప్పటికిప్పుడే నీ సమస్యలన్నీ పరిష్కరిస్తాము. అందుకే అధికారులందరితో తరలి వచ్చాము–"

రాములు ఈసారి కొంచెం సైడ్‌కి తిరిగి కెమెరాలు కనీసం సగమయినా కనబడేందుకు ప్రయత్నిస్తూ మాట్లాడాడు.

"కష్టాలు కాకుంటే ఏంది దొరా! కరెంట్ ఛార్జీలు పెరిగిపాయె– తాగనికి నీళ్ళు లేకపాయె–"

ఠక్కున అతని భార్య అందుకుంది.

"ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేద్దొరా! ధరలన్నీ పెరిగిపాయె. ఇండ్ల స్థలాలకు పట్టాలిస్తమని జమానాకెళ్ళి జెప్తున్రు కానీ ఇప్పటి వరకియ్యకపాయె–" మళ్ళీ రాములు అందుకున్నాడు.

"వ్యవసాయం జేయనికి బాంకోళ్ళు అప్పులిస్తరని జెప్పిన్రు. ఎవ్వడూ ఇయ్యకపాయె" చంద్రమ్మ దీనంగా చూస్తూ అందుకుంది.

"మాది దొంగరేషన్ కార్డని గుంజుకు పోయిన్రు సార్– మా తానిప్పుడు రేషన్ లేక పరేషానున్నాం–"

మినిష్టర్ అంతవరకూ అతికష్టంమీద నొక్కి పెట్టిన క్రౌర్యం, కోపం కట్టలు తెంచుకున్నయ్.

"గోల్‌మాల్ నర్సింహా! ఏమిట్రా ఇది? ఇలాంటోళ్ళను సెలక్ట్ చేస్తావా?

ఆళ్ళిట్ల ఒకదానెనుక ఒకటి చెప్తూనే ఉంటే టి.వి. చూసే పబ్లిక్ ఏమంటారు? మనది ఫాల్తూ గవర్నమెంటని తెలిసిపోతుంది కదా?"

గోల్‌మాల్ నర్సింహ కోపంగా రాములు వేపు తిరిగాడు.

"ఏమిరా రాములూ! నకరాల్జేస్తున్నావ్‌బే? ప్రజలకాళ్ళ వద్దకు ప్రభువులంటే ఏం జెప్పాల్నో నీకెరుకలేదురా? ఒకటిరెండు విషయాలు చెప్పి నోర్మూసుకోవాలెగానీ పెద్ద లిస్ట్ ఇస్తున్నావేందిరా? నువ్వడిగినవన్నీ చేయనికి నీ అయ్య ముల్లన్నదిబే ఈడ? బేదమాక్ సాలే–"

"గల్లతయిపాయె దొరా – కాల్‌మొక్తా – గిది ప్రతిపక్షాలోళ్ళ దర్బారనుకుంటి–

వారం కిందట ఆళ్ళతో ఒక ప్రోగ్రామిచ్చినా సార్! దాన్దిక్కుకెళ్ళి జరంత కన్‌ఫ్యూజన్ అయినా!" మళ్ళీ కెమెరాలు స్టార్టయినయ్.

మినిష్టర్ మళ్ళీ అడిగాడు.

రాములు ఈసారి బిగ్గరగా నవ్వుతూ, ఆనందం ఒలకబోస్తూ మాట్లాడాడు.

"మాకేం కష్టాలుంటయ్ దొరా – గరీబోళ్లం – మంచిగ బతుకుతున్నాం. కూలినాలి మంచిగ దొరుకుతున్నది. తిననికి తిండి, తాగనికి నీళ్ళు మందూ అన్నీ మస్తుగున్నయ్–"

చంద్రమ్మ కూడా మొఖంలో ఆనందం పలికిస్తూ మాట్లాడింది.

"అరేదొరా! అంతా మంచిగనే ఉందిగానీ మాకు ఇప్పటివరకూ రేషన్ కార్డ్ ఇవ్వకపాయె"

వెంటనే మినిష్టర్ కోపంగా కలెక్టర్ వేపు చూశాడు.

"కలెక్టర్‌గారూ! ఏమిటండీ ఇది! కూలిపనిచేసుకుని బతికే ఇలాంటి గరీబోళ్ళకు

రేషన్ కార్డ్ ఇవ్వకపోతే ఎలా? ఎలా బ్రతుకుతారు వాళ్ళు?" కలెక్టర్ రహస్యంగా మినిష్టర్ చెవిలో మాట్లాడాడుగానీ మినిష్టర్‌కి కొంచెం చెవుడుండడంతో ఆ మాటలు మాకందరికీ కూడా వినిపించినయ్.

"వీడికి ఇప్పటికే నాలుగు దొంగరేషన్‌కార్డులున్నయ్ సార్– వాటిమీద చక్కెర, బియ్యం, కిరోసిన్ తీస్కోని వేరే వాళ్ళకు లాభానికి అమ్ముకుంటున్నాడు –"

"నోనో! నేనేనా వినదల్చుకోలేదు – ఇప్పుడే అతనికి రేషన్‌కార్డ్ ఇచ్చెయ్యండి. కమాన్– ఒక నిమిషం టైమిస్తున్నాను–"

కలెక్టర్ బుర్రగోక్కుని దూరంగా నిలబడ్డా సివిల్ సప్లయ్ ఆఫీసరు దగ్గరకు పరుగెత్తాడు. రెండు నిమిషాల్లో కార్డ్ తెచ్చి మినిష్టర్‌కిచ్చాడు. మినిష్టర్ అది రాములుకిచ్చాడు.

"మాది పనిచేసే ప్రభుత్వం– పడుకునే ప్రభుత్వం కాదు" అన్నాడు ఆనందం తెచ్చుకుంటూ.

"అర్‌సార్ – మీ ప్రభుత్వం పది కాలాలు సల్లగుండాలె" అన్నాడు రాములు, చంద్రమ్మ కోరస్‌గా –

వెంటనే పార్టీ వర్కర్లతో నినాదాలు చేయించాడు నర్సింహ.

అందరూ మళ్ళీ కార్లవేపు వెళ్ళిపోతుంటే రాములు నర్సింహ వెంట పడ్డాడు.

"నువ్ జెప్పినావని కూలిపనికి బోకుండా నిలవడినాం దొరా– నేనూ, నా భార్యా నా పోరడు – మూడు కూలీలు – జర కూలి పైసలిప్పించుదొరా–"

నర్సింహ జేబులోనుంచి రెండు వందనోట్లు తీసిచ్చాడతనికి.

"ఇగో రెండందలిస్తున్నా! ఎవళ్ళయినా నీ కెంతిచ్చిండు అనడిగితే ఏం జెప్తావ్?"

"నాకెరుకే దొరా! వెయ్యిరూపాయలిచ్చిండని జెప్తా!"

"శభాష్– గట్లుండాలె–"

అంతా వెళ్ళిపోయాక రాములు వాళ్ళిద్దరి దగ్గరకొచ్చాడు.

"చూసినావ్ దొరా! గరీబోళ్ళకు డిమాండున్నదంటే నమ్మకపోతివి–"

"నీకు డిఆమండ్ మంచిగున్నదని ఎరుకయింది గానీ – పైసలయితే కమాయించినావ్ గదా– ఇప్పుడు భోజనం చేయనికి రండ్రి–"

రాములు ఓక్షణం ఆలోచించాడు.

"ఆడ భోజనం జేస్తుండగా టి.వి. లోగిట్ట సూపిస్తరాసార్? టి.విలో కనిపించేట్లుంటేనే నా భార్య ఏడకయినా అస్తదిసార్–"

యాదగిరి తో పాటు రంగారెడ్డి కూడా స్టన్ అయిపోయాడు.

'నీ యవ్వ – మీకెంత బలుపొచ్చిందిరా! నిన్న మొన్నటి వరకూ జర కూలి పనుంటే జెప్పుదొరా! తిననకి తిండి లేదని బ్రతిమలాడినోడివి కాదురా నువ్వు? టి.వి.ల నీ బొమ్మ సూపుతేనే తిండి తింటావురా నువ్వు–"

రాములు ఛటుక్కున యాదగిరి కాళ్ళమీద పడ్డాడు.

"బాంచన్ దొరా! కాల్‌మొక్తా! నాలుగు పైసలు కమాయించెడి ఎలక్షన్ దినాల్లోనే దొరా! భోజనానికి రమ్మని మా పొట్టమీద కొట్టకండ్రి –గరీబోండ్లం! ఈడనే నిలవడితే పైసలొస్తయ్–

అతను చెప్తూండగానే ఓ జీప్ వచ్చి ఆగింది. అందులోనుంచి పోలీస్ అధికారులు, ప్రభుత్వోద్యోగులు దిగారు.

దిగుతూనే ఇన్‌స్పెక్టర్ ఓసారి పాకచుట్టూ పరిశీలించి

"ఒరే రాములూ! జల్దీ ఈ జగా అంతా సాఫ్ చేయించు –జల్దీ!" అంటూ అరచాడు.

'ఏమే– ఇంకా నిలవడ్డావేంది – చీపురు తీస్కోని సాఫ్ జెయ్‌మంచిగ" అరచాడు రాములు వెంటనే.

చంద్రమ్మ, ఆమె కొడుకు చీపుళ్ళు తీసుకుని ఊడ్వటం మొదలు పెట్టారు.

"మళ్ళా పెజలవద్దకు పెభువులు గురించాదొరా?" అడిగాడు వాడు.

"కాదురా! ముఖ్యమంత్రి సాబ్ దినాం ఒక గరీబోనితో కలిసి ఆళ్ళ గుడిసెలోనే భోజనం చేసే స్కీమ్ పెట్టిన్రు! ఇయాళ నీ కుటుంబంతో కలిసి భోజనం చేస్తాడన్నమాట–"

"ఆ! ముఖ్యమంత్రి సాబొస్తుండా! ఏమే –రెండుచెట్లు కూడా ఏడికెళ్ళయినా పీక్కొచ్చి గుడిశె ముంగట పాతు! సారెప్పుడూ 'పచ్చదనం– పరిశుభ్రం' అంటుండు" అని భార్యతో చెప్పి మరీ ఇన్‌స్పెక్టర్ వేపు తిరిగాడు.

"అవ్‌సార్! ముఖ్యమంత్రిసార్ తోటి కలసి భోజనం గిట్ట జేస్తే – పైసలేమయినా ఇస్తరా?" ఇన్‌స్పెక్టర్ కోపంగా చూశాడు.

"అరేయ్ - నీయవ్వ - నీకు ఫుల్‌భోజనం పుక్కట్‌ల తినిపిస్తంటే మీదికెళ్ళి పైసలడుగుతావ్ బే?"

"కోప్పడకు దొరా! బాంచన్ - కాల్‌మొక్తా- గరీబోండ్లం సార్! కూలిపనికి బోకుండా గీడ ముఖ్యమంత్రి సార్ తోటి  కలసి భోజనం గిట్ల  చేయాల్నంటే చానా నుక్సానవుతుది దొరా!"

"నీయవ్వ చానా వుషారయిపోయినావ్‌రా-" అంటూ పక్కనున్న ప్రభుతాధికారులతో మాట్లాడాడు.

"సార్! ముఖ్యమంత్రితో కలిసి భోజనం చేసేందుకు రెండొందలు కూలీ అడుగుతున్రు కొడుకులు"

అధికారి తల గోక్కున్నాడు.

"రెండువందలు ఏ ఎకౌంట్‌లో ఇస్తాం! పోనీ ఇంకోడెవడ్నాయినా చూడు"

"కొత్తోడితో చాలా ప్రాబ్లమ్స్ ఉంటాయ్‌సార్. వీడికి ఇలాంటి వాటిల్లో మంచి ఎక్స్‌పీరియన్స్ ఉంది - పైగా  మంచి కెమెరాసెన్స్ కూడా ఉంది. కెమెరా ఎటు తిరుగుతే అటు తిరిగి పోతాడు సార్. వీటన్నిటికంటె మంచి ఆనందాన్ని అద్భుతంగా నటించగలడు. గవర్నమెంట్‌కి ఫర్‌గా మంచి స్టేట్‌మెంట్స్ కూడా ఇస్తాడు సార్- ఏదిరా రాములూ! మన ప్రభుత్వం గురించి రెండుమాటలు మాట్లాడు-"

రాములు వినయంగా చేతులు కట్టుకున్నాడు.

"కెమెరాలు ఎటు దిక్కుంటయ్ సార్"

"నేనేకెమెరా అనుకుని జెప్పు-"

రాములు ఇన్‌స్పెక్టర్ వేపు తిరిగాడు.

"ఇగో గింతకు ముందు మాకు కూలి దొరక్క, రేషన్‌బియ్యం దొరక్క పరేసానుంటిమి దొరా- మన ముఖ్యమంత్రి సాబ్ అచ్చినదగ్గరకెళ్ళి మంచిగ కూలి పనులు దొరుకుతున్నయ్- తక్కువ ధరలో బియ్యమిస్తున్రు- ఇంటిజాగా ఇచ్చిన్రు- ...గాస్‌పొయ్యి ఇచ్చిన్రు. గిసంటి సర్కారు సల్లగుంటే మనదేశంల కరువనేది ఉండది. గరీబోళ్ళు అమీర్‌లవుతారు దొరా!"

ప్రభుత్వాధికారి తప్పట్లు కొట్టాడు.

"శభాష్! చాలా బాగా ట్రైనింగిచ్చారు వీడికి. రెండొందలిచ్చినా తక్కువే-"

అంటూండగానే ఛీఫ్ మినిష్టర్ కాన్వాయ్ వచ్చేసింది.

ముఖ్యమంత్రి అతనివెనుక గన్‌మెన్‌లు, లీడర్లు, కెమెరాలు వచ్చేసినయ్.

అయిదు నిముషాల్లో ఎరేంజ్‌మెంట్స్ అయిపోయినయ్.

"ఈ కుటుంబానికి కొంతయినా ఇలాంటి ఎక్స్‌పీరియన్స్ ఉందా?" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఈ ఏరియాలో ఇతనే సీనియర్‌సార్. ఇరవై గవర్నమెంట్ స్కీమ్‌లకు వీడినే వాడాం"

"గుడ్ –కెమెరాలు ఆన్ చేయమనండి"

వెంటనే టి.వి.కెమెరాలు ఆన్ అయినయి.

"రాములూ! ఇవాళ నీ కుటుంబంతో కలిసి నీ గుడిశెలో భోజనం చేయడాని కొచ్చాను–"

"గరీబోళ్ళం దొరా! దొరలకు గరీబోళ్ళ తిండి ఏడకెళ్ళి నడుస్తది?

"ఏం ఫరవాలేదు! మీరేం తింటున్నారో అదే నేనూ తింటాను– అలాగే నా టిఫిన్ కారియర్ లో భోజనం నువ్వూ నీ కుటుంబం కూడా పంచుకోవాలి"

భోజనాలు వడ్డించారు. అందరూ తింటున్నారు.

"మీకు కూలి పనులు బాగా దొరుకుతున్నయ్యా రాములూ?"

"సర్కారోండ్లు షురూ జేసిన స్కీమ్‌ల దిక్కుకెళ్ళి మంచిగ దొరుకుతున్నయ్ దొరా! మీ సర్కారు పదికాలాలు సల్లగుండాలె!"

"ఏం చెంద్రమ్మా! ఇంటి జాగా, గాస్‌పొయ్యి అన్నీ ఇచ్చిన్రా నీకు?"

"ఇచ్చిన్రు దొరా! గాస్ పొయ్యి దిక్కు కెళ్ళి మాకు మంచిసౌలతున్నది దొరా!"

"మీ పిల్లగాడిని మంచిగచదివించండి– ఉచితంగా చదువు, వసతి, భోజనం, అన్నీ మా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది –తెలుసా?"

ఇన్‌స్పెక్టర్ రాములు చెవిలో ఊదాడు.

"ఒరేయ్ – ఆనందం మరీ ఎక్కువ చూపిస్తున్నావ్ – కొంచెం తగ్గించు–"

మరో అయిదు నిమిషాల్లో కార్యక్రమం ముగిసింది.

అందరూ వెళ్ళిపోయారు.

ప్రభుత్వాధికారి రెండొందలు ఇచ్చాడు రాములుకి.

"ఏయ్ మేము పైసలిచ్చినట్లు ఎవరికీ చెప్పవద్దు, తెలిసిందా?"

"నేనెందుకు జెప్తాసార్– నా కెరుకలేదా ఏంది?"

వాళ్ళు కూడా వెళ్ళిపోయారు.

"రాములూ – ఇవాళ ఇప్పటికే నాలుగొందలు కూర్చున్నచోట సంపాదించావ్!

ఇంక భోజనానికి వస్తావా మరి?" అడిగాడు రంగారెడ్డి.

"రెండొందలయినా ఇయ్యాలిసార్– లేకుంటే మాకు చానానుక్సాన్ అవుతది–"

యాదగిరి వాడి మీద కెళ్ళబోయాడు గానీ రంగారెడ్డి ఆపాడు.

"సరేలే రాములు– మా అమ్మ ఆత్మశాంతికి రెండొందలు ఖర్చయితే అవనీ– ఇస్తాన్లే –పద–"

అంటూండగానే మరో కారు వచ్చి ఆగింది.

అందులోనుంచి ఛోటా లీడర్ జగన్ దిగాడు.

"అరే రాములూ– జల్దీ మీ ఏరియాల ఆడాళ్ళందరినీ గవర్నర్ సాబ్ ఇంటికి తోల్కపోవాలె! అరె! ఇంక ఈడనే నిలబడ్డావేందే చంద్రీ నడు. ఆడాళ్ళందర్నీ జమచెయ్–"

రాములుకి అర్థం కాలేదు,.

"అదే సార్– గవర్నర్‌సాబ్ తాన లేడీస్ ఎందుకు?" అడిగింది చంద్రమ్మ!

"అరే నీ యవ్వ రేపు రాఖీ పండగస్తున్నది కదుబే– గవర్నర్ సాబ్‌కి రాఖీ కట్టాలె– ఇయాళ రాఖీ కడితేనే రేపు టి.వి.ల కానొస్తుందన్నట్లు– దమాక్ లేదేంబే నీకు–"

రాములుకి ఆ మాటకు కోపం వచ్చినట్లుంది.

'ఇగో సారూ– నేను గరీబోడిని! మీలెక్క నాకు పక్క ఇల్లు గిట్ల లేదు. మోటర్ బైకుల్లేవు. బాంక్‌ల పైసల్లేవు. కొలువు జేసినా, జెయ్యకపోయినా జీతాలిచ్చే సర్కారు కొలువు లేదు– దాన్దిక్కుకెళ్ళి దురాశపడతాం. కక్కుర్తి పడతాం. మాసంగతెట్లుండనీ– నెలకు యాభైవేలు జీతాల తోటి. బంగలాల మీద బంగలాలు కట్టుకొని, బాంక్‌ల లక్షల రూపాయలు మూలుగుతున్న పెద్ద పెద్ద జనరల్ మేనేజర్ సార్లే రిటైరవంగానే కక్కుర్తిపడి ఏదోఒక ఫాల్త్ కంపెనీల్లో నెలకు అయిదువేలు పదివేలుకి ఫాల్తూ కొలువులు జేస్తుర్రు గదా! అది దురాశ గాదాసార్? గరీబోడయితే దురాశ అమీరోడయితే టైమ్‌పాసా సార్?

ఇద్దరికీ వాడి స్పీచ్‌తో మతిపోయినట్లయింది.

"అరే రాములూ – నువ్ గరీబోని లెక్కలేవురా! పెద్ద షావుకారు లెక్కమాట్లాడు తున్నావ్" కోపంగా అన్నాడు యాదగిరి.

"గరీబోడు గరీబోడని నన్నంటున్రుగానీ – నాకు ఒక్క దినానికి సంపాదనెంతో నీ కెరుకనా దొరా?"

"నీలెక్క జూస్తుంటే రోజుకి కమ్‌సేకమ్ యావరేజ్ అయిదొందలు ఆరామ్‌తోటి కమాయిస్తున్నావ్ బిడ్డా నువ్వు–"

"బరాబర్ జెప్పినావ్– మరి ఇంత సదువు సదివి, కొలువులు జేస్తున్న మీ సంపాదనెంత సార్?"

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

అప్పటికప్పుడే యాదగిరి చకచక లెక్కలు కట్టాడు.

"మాకు రోజుకి మూడొందల యాభై" అన్నాడు పాలిపోయిన మొఖంతో.

"మరి గరీబోడు గరీబోడు అని మాతానకొచ్చినావేంది సార్? మనిద్దరిలో గరీబోళ్ళెవరు? నువ్వా, నేనా?"

ఇద్దరూ మొఖాలు చూసుకున్నారు.

"యాదగిరీ – రాములు చెప్పిన మాటనిజమే అనిపిస్తోంది కదూ?"

"అవ్వన్నా! నేను భీ అదే సోంచాయిస్తున్నా! ఈ లెక్కన మనకన్న గరీబోడు మనకేడకెళ్ళి దొరుకుతాడు?"

"అవును! రోజులు తారుమారయినయ్ – మా యింటికి గరీబోడిగా నువ్ రావాలి – మీ ఇంటికి గరీబోడిగా నేను వస్తా – అంతే!"

"అవ్ – గంతనేమళ్ళా నీదు – ఇప్పుడు నీ యింటికి నేనే భోజనానికొస్తా–"

ఇద్దరూ నాలుగడుగులు వేసేసరికి ఓ కారు రివ్‌మంటూ వచ్చి వాళ్ళ పక్కన ఆగింది. కారులోనుంచి ఓ సిల్కు లాల్చీ తొంగిచూసింది.

"ఏయ్! ఇక్కడ రండ్రా!"

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"పిలుస్తుటే దిక్కులు చూస్తారేందిరా! రాండ్రిటు–"

ఇద్దరు కోపంగా అతని దగ్గరకు నడిచారు.

"ఇగో ఇయాళ మా ఫాదర్‌ది డెత్ సెర్మనీ ఉన్నది. ఇయాళ గరీబోళ్ళకి భోజనం గిట్ల పెడితే మా నాయన ఆత్మ ఖుష్ అవుతదని మా అమ్మ జెప్పింది - మీ ఇద్దరికి మంచిగభోజనం పెడతా! కారెక్కండ్రి!" ఇద్దరికీ వళ్ళు మండిపోయింది.

"ఏంది? మాకు భోజనం పెడతావ్? వాట్ నాన్సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? మేమవళనుకుంటున్నావ్ అసల్కి? మీదిక్కెళ్ళి 'రా''గీ' అంటున్నావ్ ఏంది సంగతి?" ఎదురు తిరిగాడు యాదగిరి.

సిల్కులాల్చీ తెల్లబోయాడు.

"అంటే మీరు గరీబోళ్ళు కాదా?"

"మేము గరీబోళ్ళేంటయ్యా! ఉద్యోగస్తులం! తెలుసా?" అతను కంగారుపడ్డాడు.

"గట్లనా? సారీభయ్- మిమ్మల్ని జూస్తే కూలోళ్ళ లెక్క కనిపించిన్రు. దాన్దిక్కు కెళ్ళి గట్లన్నా - మాఫ్ కర్‌నా భాయ్"

అతని కారు వెళ్ళిపోయింది.

ఇద్దరూ అవమానంతో దహించుకుపోతూ ఇల్లు చేరుకున్నారు.

జరిగిందంతా విని రంగారెడ్డి భార్య పగలబడి నవ్వింది ఆనందంగా.

"ఆయనన్న దాంట్లో తప్పేముంది? మీరు ఆఫీస్‌లో కూలి పని చేస్తున్నాడు. రాములు రోజుకొకడి దగ్గర కూలిపని చేస్తున్నాడు. అంటే మీరు పెద్దకూలీ వాడు చిన్న కూలీ - సారీ జీతం బట్టి చూస్తే రాములు పెద్ద కూలీ- మీరు చిన్న కూలీలు-"

ఇద్దరూ జవాబివ్వలేదు.